సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 28 । జూన్ । 2023



డీవైఎస్‌వోగా రాందాస్
సిరిసిల్లటౌన్: డీవైఎస్‌వోగా అజ్మీర రాందాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను మర్యాదపూర్వకంగా కలవగా ఆయన అభినందించారు.



రాజన్న సన్నిధిలో టెండర్లు
వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల సౌకర్యాల కల్పనలో భాగంగా మంగళవారం చైర్మన్ చాంబర్‌లో ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0/25.0

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మెరుగైన వైద్యసేవలందించాలి


ఎన్‌క్వాస్ బృందంతో వైద్యసిబ్బంది

బోయినపల్లి(చొప్పదండి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పీహెచ్‌సీలో ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఎన్‌క్వాస్ బృందం సభ్యులు డాక్టర్ సాజిత్ జోన్, డాక్టర్ రేణు భ్యానాలు అన్నారు. ఎన్‌క్వాస్ గుర్తింపు జాతీయ నాణ్యత ప్రమాణాల తనిఖీల్లో భాగంగా రెండో రోజు మంగళవారం బోయినపల్లి పీహెచ్‌సీలో తనిఖీలు చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రి రికార్డులు, సిబ్బంది తెలివితేటలు తదితర అంశాలు పరిశీలించారు. ఆస్పత్రి అభివృద్ధి విషయంలో పలు సూచనలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఔట్, ఇన్ పేషెంట్ల విషయంలో శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సుమన్‌మోహన్‌రావు, డీఐఓ డాక్టర్ మహేశ్, డీపీఓ ఉమ, పీహెచ్‌సీ వైద్యాధికారిణిలు రేణుక, రేణు ప్రియాంక, జిల్లా క్వాలిటీ మేనేజర్ విద్యాసాగర్, సూపర్‌వైజర్ శశికుమార్, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో కుదిరిన కూలి ఒప్పందం


హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని సారంపల్లి-బద్దెనపల్లి టెక్స్ టైల్ పార్కులో పవర్ లూమ్ కార్మికులకు, యజమానులకు మంగళవారం జరిగిన కూలి చర్చలు సఫలమైనట్లు సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ లూమ్ కార్మికులకు బతుకమ్మ చీరల బ్లౌజ్ పీస్‌లకు కూలి పెంచాలని లేనిపక్షంలో జూలై 1న సమ్మెకు వెళ్తున్నట్లు ప్రకటించామని అన్నారు. మంగళవారం యజమానులతో జరిపిన కూలి చర్చలు సఫలమై మీటర్ వస్త్రానికి రూ.3 నుంచి రూ.3.70 పైసలు చెల్లించేందుకు ఒప్పందం జరిగిందని తెలిపారు. కూలి చర్చల్లో సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, జెల్ల సదానందం, కారంపురి మహేష్, శ్రీనివాస్, మహేశ్, టెక్స్‌టైల్ పార్కు యజమానుల అధ్యక్షుడు అన్నల్దాస్ అనిల్, లక్ష్మీనారాయణ, వేణు, లక్ష్మణ్, రాజేశం, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో రక్తదాన శిబిరం


సిరిసిల్ల డిపోలో రక్తదానం చేస్తున్న సిబ్బంది


సిరిసిల్లటౌన్: టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆదేశాల మేరకు మంగళవారం సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. డిపోలో పనిచేసే 40 మంది సిబ్బంది రక్తాన్ని దానం చేశారు. ×ఒకరి రక్తదానం.. ముగ్గురికి ప్రాణం× కార్యక్రమంలో భాగంగా బ్లడ్‌క్యాంపు నిర్వహించినట్లు డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు. ఎస్టీఐ సారయ్య, రాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ బీమాతో ధీమా
సిరిసిల్ల: పోస్టర్ బీమా పథకాలతో ఎంతో ధీమా లభిస్తుందని రాజన్న సిరిసిల్ల జిల్లా పోస్టర్ అధికారి పెరుగు దయానంద్ అన్నారు. వేములవాడకు చెందిన కాసారపు తిరుపతిగౌడ్ పోస్టాఫీస్‌లో గతేడాది రూ.399 చెల్లించి బీమా చేయించుకున్నాడని, అతను ఇటీవలి కాలంలో ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలుకాగా ప్రమాద బీమా పాలసీ ద్వారా రూ.65వేలు ఆర్థిక సాయం మంజూరైందని తెలిపారు. ప్రమాద బీమా చెక్కును తిరుపతిగౌడ్‌కు అందించారు.

రేపు రాజన్న సన్నిధిలో తొలి ఏకాదశి వేడుకలు
వేములవాడ: రాజన్న సన్నిధిలో ఈనెల 29న ఆషాఢ తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఉదయం శ్రీస్వామి వారికి, అనుబంధ దేవతలకు అభిషేకాలు, అర్చనలు, రుక్మిణి విఠలేశ్వర స్వామి వారలకు పంచోపనిషత్ ద్వారా అభిషేకాలు, సాయంత్రం 6.30 నుంచి మహాపూజ నిర్వహిస్తామన్నారు. ఇదేరోజు ఉదయం 5 గంటల నుంచి ఈనెల 30న ఉదయం వరకు అఖండ జన, హరికథలు, భక్తిసంగీతం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉత్తదైన కొత్త మండలాల ఆశలు

- పల్లెల డిమాండ్‌ను పట్టించుకోని ప్రభుత్వం
- జగిత్యాల జిల్లాలో కొత్త మండలంగా బండలింగాపూర్
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆవిరైన ఆశలు




గాలిపల్లిలో గ్రామస్తుల నిరసన(ఫైల్)

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్త మండలాల ఆశలు ఆవిరయ్యాయి. జిల్లాలోని పలు గ్రామాలను మండలాలుగా ప్రకటించాలనే ప్రతిపాదనలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా జగిత్యాల జిల్లాలోని బండలింగాపూర్‌ను పది గ్రామాలతో కొత్త మండలంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్త మండలాల ఆశలన్నీ ఉత్తవయ్యాయి. 37 ఏళ్ల కిందట మండల వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటికి పల్లెలు అనేక మార్పులకు గురయ్యాయి. పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం చిన్న జిల్లాలు, చిన్న మండలాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొత్త మండలాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లు తెరపైకి వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు కు కొత్త మండలాలను ఏర్పాటు చేయాలనే వినతులు అందాయి. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో నిరాశకు గురవుతున్నారు.

➡ ఇల్లంతకుంట మండలంలోని గాలిపల్లి వాసులు కొద్ది రోజులుగా గాలిపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. నిజానికి ఇల్లంతకుంట మండల కేంద్రానికి గాలిపల్లి 7 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కానీ మండలాల్లో గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉంది. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బద్దం ఎల్లారెడ్డి స్వగ్రామంగా గాలిపల్లికి ప్రత్యేక గుర్తింపు. ఈనేపథ్యంలో గాలిపల్లి మండలాన్ని ప్రకటించాలని గతంలో గ్రామస్తులు ఆందోళనలు చేసి, సిరిసిల్లలో ప్రదర్శన నిర్వహించారు.

➡ తంగళ్లపల్లి మండలం జిల్లెల్లను మండల కేంద్రం చేయాలనే ప్రతిపాదన ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు సరిహద్దు గ్రామమైన జిల్లెల్ల కేంద్రంగా సమీప గ్రామాలను కలుపుతూ మండల కేంద్రంగా మార్చాలని కోరుతున్నారు. జిల్లెల్లను మండలం చేయాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

కొత్త మండలాల డిమాండ్లు ఇవీ..

➡ గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి మండల కేంద్రం చేయాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. గతంలో కొత్తపల్లి మండలం కోసం పాదయాత్రలు, నిరహార దీక్షలు చేశారు. జిల్లా సరిహద్దు గ్రామంగా కొత్తపల్లికి గుర్తింపు ఉంది.

➡ వేములవాడ రూరల్ మండలాన్ని చెక్కపల్లి, నూకలమర్రి కేంద్రాల్లో ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. ఆ రెండు గ్రామాల వారు మండల కేంద్రం కావాలని కోరుతున్నారు. చెక్కపల్లి వాసులు ఏకంగా విరాళాలు సేకరించి మండల కేంద్రం కోసం భూమిని కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచారు. వేములవాడలో కొనసాగుతున్న రూరల్ మండలాన్ని చెక్కపల్లికి మార్చాలని కోరుతున్నారు.

➡ సిరిసిల్ల పట్టణంలో విలీనమైన ఏడు గ్రామాల వాసులు ఆ ఏడు గ్రామాలను కలిపి కొత్త మండలం చేయాలని కోరుతున్నారు. మున్సిపల్ విలీనం నుంచి తొలగించి గ్రామ పంచాయతీలుగా ఉంచాలని, కొత్త మండలం ఏర్పాటు చేయాలని ఆందోళనలు చేశారు.

➡ కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట, ధర్మారం వాసులు సైతం తమ గ్రామాన్ని మండల కేంద్రం చేయాలని కోరుతున్నారు. 2016లో కొత్తగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటుతో రుద్రంగి, వీర్నపల్లి, తంగళ్లపల్లి, వేములవాడ రూరల్ మండలాలు ఏర్పాటు అయ్యాయి. తొమ్మిది మండలాలను 13 మండలాలకు మార్చారు. పొరుగు జిల్లాలో కొత్తగా బండలింగాపూర్‌ను మండలంగా ప్రకటించగా కొత్త మండలాల ఆశలు అడిఆశలయ్యాయి.

రూ.30లక్షలతో స్థలం కొన్నం

మా ఊరు మండల కేంద్రం కావాలని దాతల సహకారంతో రూ.30లక్షలతో మూడున్నర ఎకరాల స్థలం కొన్నం. వేములవాడ రూరల్ మండలాన్ని చెక్కపెల్లికి మార్చాలని కోరుతున్నాం. అన్ని గ్రామాలకు మా ఊరు అందుబాటులో ఉంటుంది.
– ఎదపల్లి అనిల్, చెక్కపెల్లి

ఐదేళ్లుగా డిమాండ్ చేస్తున్నాం

గాలిపల్లిని మండలం చేయాలని ఐదేళ్లుగా కోరుతున్నాం. అనేక సార్లు ఉద్యమించాం. అన్ని రకాలుగా గాలిపల్లికి మండల కేంద్రంగా మార్చే అర్హతలు ఉన్నాయి. గాలిపల్లి ఉద్యమాల చరిత్రను గుర్తించి ప్రభుత్వం మండల కేంద్రంగా మార్చాలి.
– అయ్యన్నగారి మహిపాల్‌రెడ్డి, గాలిపల్లి.

కొత్తపల్లిని మండలం చేయాలి

గంభీరావుపేట మండలంలో పెద్ద గ్రామం మాది. కొత్తపల్లిని మండల కేంద్రంగా మార్చాలని పాదయాత్రలు చేశాం. కామారెడ్డి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల మూడు జిల్లాల సరిహద్దులోని గ్రామం కావడంతో మా కొత్తపల్లిని మండల కేంద్రంగా మార్చాలి.
– గౌటే గణేశ్, కొత్తపల్లి

ఉలిక్కిపడ్డ ఉమ్మడి జిల్లా
- రామగుండంలో తండ్రి కూతురిని అదుపులో తీసుకున్న ఏటీఎస్
- ఉగ్రవాదులతో సంబంధాలున్నాయని ఆరోపణలు
- విచారణ నిమిత్తం హైదరాబాద్ తరలింపు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో గుజరాత్ పోలీసులు రామగుండంలో తండ్రీకూతురిని అదుపులోకి తీసుకోవడం కలకలం సృష్టించింది. ఇటీవల శ్రీనగర్ కు చెందిన నలుగురు ఇస్లామిక్ స్టేట్ సానుభూతిపరులను గుజరాత్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్టు చేశారు. వారిలో సమేరా బాను అనే మహిళతో తెలంగాణలో పలువురు చాటింగ్ చేసినట్లు గుర్తించిన ఏటీఎస్ పోలీసులు పాతబస్తీతో పాటు వివిధ ప్రాంతాల్లో మంగళవారం దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్న తండ్రి (40), కూతురు (20) నాలుగు రోజుల క్రితం గోదావరిఖనిలోని శ్రీనగర్ కాలనీలోని బంధువుల ఇంట్లో షెల్టర్ తీసుకున్నారు. దీంతో గుజరాత్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రామగుండం సీపీ ఎదుట హాజరుపరిచారు. ఉగ్రవాదులతో సంబంధాలపై విచారంచినట్లు సమాచారం. మీకు సమేరా భాను ఎలా పరిచయం? ఎన్ని రోజుల నుంచి తెలుసు? వారితో ఏంచాట్ చాట్ చేశారు? తదితర అంశాలపై ప్రశ్నించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశాక, హైదరాబాద్ తరలించారు.

జిల్లాలో చిరుజల్లులు
- చల్లబడిన వాతావరణం
- చందుర్తిలో అత్యధికంగా 5.6 మిల్లీ మీటర్ల వర్షం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. రెండు రోజులుగా తుంపర వానలు పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జిల్లాలో అత్యధికంగా చందుర్తిలో 5.6 మిల్లీ మీటర్ల వర్షం కురియగా.. అత్యల్పంగా ఇల్లంతకుంటలో 0.6 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలోని రుద్రంగిలో 3.5, వేములవాడ రూరల్‌లో 2.5, బోయినపల్లిలో 2.1, సిరిసిల్ల, వేములవాడలలో 1.9, కోనరావుపేటలో 4.7, వీర్నపల్లిలో 1.4, ఎల్లారెడ్డిపేటలో 1.3, గంభీరావుపేటలో 1.1, ముస్తాబాద్‌లో 1.2, తంగళ్లపల్లిలో 1.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పీ.బీ.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో 45 మిల్లీ మీటర్ల లోటు వర్షపాతం నెలకొంది.

వైద్యసేవలపై గ్రామసభలు

- ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహించాలి
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ప్రభుత్వ వైద్యశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న వైద్యసేవలపై ప్రతినెలా మొదటి బుధవారం గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలు బాగా విస్తరించాయని, ప్రస్తుతం 63శాతం డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతున్నాయని, దానిని 80 శాతానికి పెంచాలన్నారు. గర్భిణుల్లో నమ్మకాన్ని పెంచేలా అందరూ కృషి చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలను దసరా నాటికి పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లను ఆదేశించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ మంగళ, శుక్రవారం డ్రైడే నిర్వహించి డెంగీ, మలేరియా ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్, స్ప్రేయింగ్ చేయాలని, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కీటక జనిత వ్యాధులను క్షేత్రస్థాయిలో కట్టడి చేయాలని, దీనిపై నిత్యం నివేదిక అందించాలని వైద్యశాఖ అధికారులను కోరారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వోలు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ మురళీధర్‌రావు, వేములవాడ ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మహేశ్‌రావు, జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల డాక్టర్లు పాల్గొన్నారు.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే


తిలకిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

వేములవాడరూరల్: వచ్చే ఎన్నికల్లో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో రూరల్ అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో మేరా భూత్ సబ్‌సే మస్బూత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రామకృష్ణ హాజరై మాట్లాడుతూ బీజేపీపై ప్రతి ఒక్కరికీ నమ్మకం కలిగిందని రానున్నది మా ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, రేగుల సంతోష్‌బాబు, లింగంపల్లి కిశోర్, వంశీ, పర్శరాం, మధు, పరమేష్, మల్లికార్జున్, వెంకటేశ్, అనిల్, బూత్ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: మహిళల రక్షణకు జిల్లా పోలీసు శాఖ అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం గీతానగర్ పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సెల్ఫ్‌డిఫెన్స్ శిక్షణలో మాట్లాడారు. ఆపరేషన్ జ్వాల పేరిట జిల్లాలోని విద్యాలయాల్లో విద్యార్థినులకు స్వీయరక్షణ కోసం శిక్షణ అందించే శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, విద్యార్థినులు స్వీయ రక్షణ విధానాలు నేర్చుకోవడం ద్వారా ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకోవచ్చని అన్నారు. జిల్లాలోని 113 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శిక్షణకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. మూడు నెలల పాటు సెల్ఫ్ డిఫెన్స్‌పై అనుభవం కలిగిన శిక్షకులతో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సిరిసిల్ల, వేములవాడలోని ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10 రోజులు శిక్షణ జరుగుతుందన్నారు. ఆకతాయిల బారి నుంచే కాకుండా చైన్ స్నాచింగ్, మహిళలపై లైంగిక దాడులు జరిగే క్రమంలో వారిని సమర్థవంతంగా తిప్పికొట్టడం లాంటి టెక్నిక్స్ నేర్పించడం కోసమే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రమేశ్, సీఐలు అనిల్‌కుమార్, ఉపేందర్, ప్రధానోపాధ్యాయులు బాగ్యారేఖ, ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ పద్మజ, ఎస్సై శ్రీకాంత్, రమేశ్, రాజు, కరాటే మాస్టర్ మన్నాన్ పాల్గొన్నారు.

గల్ఫ్‌లో ఆగుతున్న గుండె

వేములవాడ అర్బన్ మండలం కొడుముంజకు చెందిన నాగుల నర్సయ్య పదేళ్లుగా దుబాయ్ పోతున్నాడు. అక్కడ కష్టపడి తన ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశాడు. విధి వెక్కిరించడంతో ఇద్దరు కూతుర్ల భర్తలు మృతి చెందారు. ఏమి చేయలేని పరిస్థితిలో పర్శయ్య మనోధైర్యంతో బిడ్డలను, భార్యను చూసుకునేందుకు అక్కడ కష్టపడుతున్నాడు. అయినప్పటికీ విధి ఆయనను వెంటాడింది. వారం రోజుల క్రితం ఆయనకు గుండెనొప్పి రావడంతో తోటి స్నేహితులు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడే మృతి చెందాడు. శవపేటిక మంగళవారం స్వగ్రామానికి చేరింది. చిన్న బిడ్డ స్వప్న అతడి చితికి నిప్పు పెట్టింది. ఇద్దరు బిడ్డలు, తల్లి ఒంటరిగా మిగిలారు. ఈ విషాద సంఘటన ఆ గ్రామంలో ప్రతిఒక్కరినీ కంటతడి పెట్టించింది.

వేములవాడలోని సుభాష్‌నగర్‌కు చెందిన దూలం రఘు కొన్నేళ్లుగా గల్ఫ్ దేశం పోతున్నాడు. ఆరు నెలల్లో స్వదేశానికి వచ్చి పెళ్లి చేసుకుంటానని తల్లితో మాట్లాడిన ఆయన అక్కడ విధులు నిర్వహిస్తూ రోడ్డు దాటుతుండగా కారు ప్రమాదంలో అక్కడిక్కడే మృతి చెందాడు. వారం రోజుల క్రితం ఆయన శవపేటిక ఇంటికి చేరింది. ఇలా కారణాలు ఏమైనా ఎన్నో ఆశలతో గల్ఫ్ బాట పట్టిన కార్మికుల బతుకులు గాలిలో కలుస్తున్నాయి. వారిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి కుటుంబాలు ఆశలు నెరవేరకముందే వారు అసువులు బాసుతున్నారు.

కోనరావుపేట మండలం ధర్మారంకు చెందిన మైలారం నర్సయ్య కొన్ని నెలలుగా బెహరన్ దేశానికి వెళ్తున్నాడు. సోమవారం బల్దియాలో పనిచేస్తుండగానే గుండెనొప్పి రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆయనకు భార్య, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శివయ్యగారి నవీన్ కొన్నేళ్లుగా దుబాయ్‌లో ఉంటున్నాడు. గతేడాది ఇండియాకు వచ్చి పెళ్లి చేసుకొని భార్యతో మళ్లీ గల్ఫ్‌కు వెళ్లాడు. పదిరోజుల క్రితం కంపెనీలో విధులు నిర్వహిస్తుండగా గుండె నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు ఆస్పత్రిలో చేర్పించినా ఫలితం లేదు. తల్లిదండ్రులకు ఒకే కుమారుడు కాగా ఆయన మృతదేహంతో భార్య రావడం గ్రామంలో ప్రతిఒక్కరిని కలిచివేసింది. ఉన్న ఒక్క కొడుకు చనిపోవడంతో శవపేటికపై శివయ్య తల్లిదండ్రులు పడి అయ్యో కొడుకా.. మా బాగోగులు చూసుకుంటావనుకుంటే మా కళ్లముందే ఇంత పనిచేశావంటూ వారి రోధనలు అంతా ఇంతా కాదు.

- వరుసగా వస్తున్న శవపేటికలు
- ఆందోళన చెందుతున్న కుటుంబాలు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బాధితులు


శవపేటిక వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు (ఫైల్)

వేములవాడరూరల్: ఉన్న ఊరిలో ఉపాధి లేక కొన్నేళ్లుగా గల్ఫ్ బాట పట్టిన నిరుద్యోగ కూలీలు అక్కడ వివిధ కారణాలతో మృతి చెంది శవపేటికలో ఇంటికి చేరుతున్నారు. కన్నవారిని కాదని భార్యపిల్లలను వదిలి ఎన్నో ఆశలతో ఎడారి బాట పట్టిన కార్మికులపై ఆశలు పెట్టుకున్న వారి కుటుంబాల్లో వివిధ కారణాలతో అక్కడ మృతి చెంది ఇంటికి శవమై రావడంతో వారి రోదనలు ఆకాశాన్నంటుతున్నాయి.

పది రోజుల్లో వరుస సంఘటనలు

ఇటీవల గల్ఫ్‌లో వివిధ కారణాలతో మృతి చెందిన జిల్లాకు చెందిన కార్మికుల మృతి సంఘటనలు వారి కుటుంబాల్లో ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇక్కడ ఉపాధి లేక కొందరు వెళ్తే.. మరికొందరు కంపెనీపై ఉన్న నమ్మకంతో వెళ్తున్నారు. అలాంటి వారు కంపెనీలో విధులు నిర్వహిస్తూ గుండెనొప్పి రావడంతో మరణిస్తున్నారు. ఎడారి ప్రాంతంలో మరణిస్తున్న గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలంటూ ప్రతిఒక్కరూ కోరుతున్నారు.

మనోళ్ల సాయం

గల్ఫ్‌లో మృతి చెందుతున్న కార్మికుల మృతదేహాలను స్వదేశానికి పంపించేందుకు మనోళ్లు చేస్తున్న సహాయ సహకారాలు అంతా ఇంతా కాదు. వివిధ దేశాల్లో తెలుగువారు స్థిరపడి ఆర్థికంగా అక్కడ ఉండగా మన ప్రాంతం వారు చనిపోతే వారు స్వయంగా కంపెనీ యజమానులతో మాట్లాడి మృతదేహాలను పంపించేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. వేములవాడకు చెందిన తోట రాంకుమార్, గోలి మోహన్, ఎల్లారెడ్డిపేటకు చెందిన రాదారపు సత్యంతో పాటు ఎందరో ఇలాంటి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

జిల్లా నుంచి ఎందరో కార్మికులు బతుకుదెరువు కోసం గల్ఫ్‌బాట పట్టారు. ప్రధానంగా మెట్ట ప్రాంతం ఉన్న ఈ ప్రాంతంలో నీటి సౌకర్యం లేక వివిధ కారణాలతో గ్రామాలు వదిలి గల్ఫ్‌కు వెళ్తున్నారు. అక్కడ కంపెనీ ఇబ్బందులు, కుటుంబాల బాధ్యతలతో అకస్మాత్తు మరణాలు చెందుతున్నారు. అలాంటి వారి కుటుంబాలను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

నా వంతు సాయం చేస్తున్న..

వేములవాడ మండలం నూకలమర్రికి చెందిన నేను యూఎస్‌ఏలో ఉన్నప్పటికీ ఇప్పటివరకు దాదాపు 8 దేశాల్లో 30 నుంచి 40 మంది మనోళ్లు వివిధ కారణాలతో మృతి చెందగా నాకున్న సంబంధాలతో వారి మృతదేహాలను స్వదేశానికి పంపించా. కంపెనీలో వచ్చే లాభాలతో పాటు నా వంతు సాయం అందిస్తున్న.
– డా.గోలిమోహన్, యూఎస్ఏ, ఎఫ్‌డీఏ అప్రూవ్డ్ బోర్డు సైంటిస్ట్

సహకారం అందిస్తున్న

దుబాయ్‌లో స్థిరపడిన నేను వీర్నపల్లి మండలం అడవిపదిరకు చెందిన వాడిని. ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ నాలాంటి కార్మికులకు కష్టాలు వస్తే నా వంతు సాయం అందిస్తున్న. నా గ్రామం, మండలం అని తేడా లేకుండా సహకారం అందిస్తున్న.
– రాధారపు సత్యం, ఎల్ఎస్‌పీఎమ్‌కే సంస్థల అధినేత, దుబాయ్

క్లుప్తంగా

గోశాలలకు రాజన్న ఆవులు అందజేత



ఆవులను అందజేస్తున్న ఆలయ అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని ఆవులను వేములవాడ పట్టణం ముదిరాజ్‌వీధిలోని శ్రీరాజన్నస్వామి గోశాలకు పది ఆవులను సోమవారం అందజేశారు. ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యామ్, శంకర్ ఉన్నారు.

మంత్రులకు ఆహ్వానం



మంత్రి గంగులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

వేములవాడ: వేములవాడలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రగతిభవన్‌లో బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సోమవారం కలిసి ఆహ్వానించారు. రూ.12 కోట్లతో గుడి చెరువులో చేపట్టే పనులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీబంధు చెక్కుల పంపిణీకి మంత్రి గంగుల కమలాకర్‌లను ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

చెట్ల అమ్మకంపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని అంకుషాపూర్‌లో జిల్లా అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. గ్రామ చెరువు సమీపంలో అనుమతులు లేకుండా అక్రమంగా చెట్లను నరికి అమ్ముకున్నారని తెలుపుతూ ‘చెరువులోని చెట్లు అమ్ముకున్నరు’ శీర్షికతో సోమవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అంకుషాపూర్ పంచాయతీ కార్యదర్శిని విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

మిస్సయిన సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్సై ప్రేమ్‌దీప్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్లకు చెందిన బిల్లా వెంకట్రాములు ఈనెల 11న సెల్‌ఫోన్ పోయినట్లు ఫిర్యాదు చేయగా.. సోమవారం అప్పగించినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపారు. అతని సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను సీఈఐఆర్ యాప్‌లో నమోదు చేయడంతో ఫోన్ ఆచూకీ లభించిందని వివరించారు. ఇక నుంచి ఎవరు సెల్‌ఫోన్ పోయిన వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.

బోయినపల్లిలో..

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్‌కు చెందిన కపార్తి నర్తక్ యువకుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సోమవారం బాధితుడికి ఏఎస్సై బాబు పోలీస్‌స్టేషన్‌లో అందించారు. నర్తక్ సెల్‌ఫోన్ పోయిందని ఈనెల 12న బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బైక్‌పై వెళ్తుండగా పోయిందని తెలిపాడు. పోలీసులు సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ గుర్తించి బాధితుడికి అందించారు. ఏఎస్సై బాబు మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో వివరాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు.

సెస్‌లో అక్రమార్కులు

- మాయమైన 10,800 విద్యుత్‌స్తంభాలు
- సిబ్బంది చేతివాటం
- రైతులకే అమ్ముకున్నట్లు అనుమానాలు
- విచారణకు అధికారుల నియామకం
- దృష్టి సారించిన సెస్ చైర్మన్ రామారావు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల విద్యుత్ సరఫరా సహకారం సంఘం(సెస్)లో భారీ ఎత్తున అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. ఏళ్లుగా సాగుతున్న అవినీతి, అక్రమాలు ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సెస్ సిబ్బంది చేతివాటంతో దాదాపు 10,800 విద్యుత్ స్తంభాల లెక్క తెలియడం లేదు. లూజ్ వైర్ల మరమ్మతు పేరుతో సెస్ సంస్థ నుంచి పొందిన కరెంట్‌పోల్స్‌ను సిబ్బంది, కాంట్రాక్టర్ ఒక్కటై రైతులకే అమ్ముకున్నట్లు తెలుస్తోంది. ఈ అవినీతిలోని పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఇద్దరు ఏడీలను నియమించారు. మంత్రి కేటీఆర్ చొరవతో సెస్ సంస్థ అన్ని విధాలా బలోపేతమైందని, దాన్ని కాపాడుకుంటామన్నారు.

2006 నుంచి కొనసాగుతున్న అక్రమాలు

సెస్‌పరిధిలో 2006 నుంచి లూజ్‌లైన్ల మరమ్మతు పనులు చేపట్టారు. అప్పటి నుంచి పోల్స్‌ను ఎక్కడెక్కడ వేశారో ఆరా తీస్తున్నారు. ఈక్రమంలోనే దాదాపు 10,800 విద్యుత్‌స్తంభాల లెక్క తేలడం లేదు. అసలు వాటిని ఎక్కడ వేశారు? అనే దానిపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఇద్దరు ఏడీలు విచారణ చేపడుతున్నారు.

సిబ్బంది, కాంట్రాక్టర్ కుమ్మక్కుతో..

సెస్ సిబ్బంది, లూజ్‌లైన్ల మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కుమ్మక్కవడంతోనే అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. రైతులకు ఒక్కో స్తంభాన్ని రూ.3వేలకు విక్రయించినట్లు తెలిసింది. గతంలో పనిచేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్‌లు ఒక్కటవ్వడంతోనే విద్యుత్ స్తంభాలు మాయమైనట్లు చర్చ సాగుతోంది. ఏది ఏమైన పోల్స్ లెక్క తేల్చాల్సిందేనని సెస్ ప్రస్తుత చైర్మన్ చిక్కాల రామారావు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

విచారణ చేపడుతున్నాం



సిరిసిల్ల సెస్ పరిధిలో 10,800 విద్యుత్ స్తంభాలకు లెక్క లేకుండా పోయింది. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, చందుర్తి, రుద్రంగి మండలాల్లో స్తంభాలు ఎక్కడ వేశారో తెలియడం లేదు. విద్యుత్ స్తంభాల అమ్మకాలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. నష్టాలలో ఉన్న సెస్ సంస్థను మంత్రి కేటీఆర్ సహకారంతో లాభాల్లోకి తెచ్చేందుకు కృషి చేస్తాం. ఎంతో పేరున్న సంస్థను కాపాడడానికి అందరూ సహకరించాలి.

– చిక్కాల రామారావు, సెస్ చైర్మన్

రైస్‌మిల్లర్లకు వెసులుబాటు

- వంద శాతం బియ్యం సేకరణకు ఆదేశాలు
- ఆ తరువాత 25 శాతం జరిమానా

సాక్షి ఎఫెక్ట్

సిరిసిల్ల: జిల్లాలోని 36 మంది రైస్‌మిల్లర్లకు విధించిన రూ.10 కోట్ల జరిమానాల వసూళ్లకు వెసులుబాటు కల్పించారు. 2021–2022 వానాకాలం సీజన్‌కు సంబంధించి 12,490 మెట్రిక్ టన్నుల బియ్యం అందించడంలో రైస్‌మిల్లర్లు జాప్యం చేశారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన పౌరసరఫరాలశాఖ 25 శాతం మేరకు అదనపు బియ్యం లక్ష్యంతో ఆ మేరకు నగదు జరిమానాలను రూ.10కోట్ల మేరకు విధించారు. దీనిపై ‘మిల్లర్లపై సీఎమ్మార్ కత్తి’ శీర్షికన జూన్ 24న ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పౌరసరఫరాల అధికారులు పొరుగు జిల్లాల్లోని కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్) విధానం తెలుసుకొని.. ముందుగా వంద శాతం బియ్యాన్ని సేకరించాలని, తర్వాత ప్రభుత్వం విధించిన 25 శాతం అదనపు జరిమానాలను వసూలు చేయాలని నిర్ణయించారు. దీంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 12,490 మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్ సోమవారం తెలిపారు.

అధికార పార్టీ నేతల చుట్టూ

పౌరసరఫరాలశాఖ విధించిన రూ.10 కోట్ల జరిమానాను మాఫీ చేయించుకునేందుకు రైస్‌మిల్లర్లు అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. 2023 మార్చి 31లోగా సీఎమ్మార్ బియ్యం ఇవ్వని రైస్‌మిల్లర్లకు 25 శాతం అదనపు బియ్యం లక్ష్యంతో రూ.10కోట్ల జరిమానా విధించారు. తక్షణమే రూ.2 కోట్లు చెల్లించాలని ఆదేశించారు. మంత్రి కేటీఆర్‌ను కలిసి రూ.10కోట్ల జరిమానాను మాఫీ చేయించుకోవాలని రైస్‌మిల్లర్లు ప్రయత్నిస్తున్నారు. ఈలోగా సీఎమ్మార్ సేకరణకు జరిమానాలతో సంబంధం లేకుండా వెసులుబాటు కల్పించడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.



జూన్ 24న‘సాక్షి’లో ప్రచురితమైన కథనం

ముందుగా బియ్యం తీసుకుంటాం

2021–2022 నాటి సీఎమ్మార్ లక్ష్యం మేరకు ముందుగా వంద శాతం బియ్యం తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవో 11 ప్రకారం 25 శాతం జరిమానాలను విధించాం. సీఎమ్మార్ లక్ష్యం పూర్తయిన తరువాత ఐదు దఫాలుగా జరిమానాలు వసూలు చేస్తాం. రైస్‌మిల్లర్లు పెండింగ్‌లో ఉన్న బియ్యం ఇప్పుడు పెట్టాల్సి ఉంది.

– ఎన్.ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్

ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని.. వాటిని చేరుకునేందుకు నిరంతరం శ్రమించాలని ప్రాణహిత ఎడ్యుకేషన్ ట్రస్టు ప్రతినిధులు పేర్కొన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం నగదు బహుమతిగా అందించారు. పదోతరగతిలో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.4వేల చొప్పున, మిగతా తరగతుల్లో ఫస్ట్, సెకండ్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.వెయ్యి, రూ.500 చొప్పున అందించారు. పది జీపీఏ సాధించిన నేవూరి హారిక, ముహమ్మద్ రిహాన్ తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి కందుకూరి రమణ మాట్లాడుతూ విద్యార్థులు చదివే అలవాటును పెంపొందించుకోవాలన్నారు. ప్రతినిధులు మోతె దేవరెడ్డి, మద్దికుంట లక్ష్మణ్, హెచ్ఎం దబ్బెడ హన్మాండ్లు, ఉపాధ్యాయులు ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, రాజమల్లు, రాచర్ల వెంకట్, శ్రీనివాస్, రాజు, రాములు, ఆనందం, ఇంద్రాదేవి, జయశ్రీ పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

బోయినపల్లి పీహెచ్‌సీలో ఎన్‌క్వాస్ బృందం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి పీహెచ్‌సీని సోమవారం ఎన్‌క్వాస్ బృందం సభ్యులు సాజిత్ జోన్, రేణు భ్యానా సోమవారం సందర్శించారు. ఎన్‌క్వాస్ గుర్తింపు లభించేలా పీహెచ్‌సీని తీర్చిదిద్దాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించడంతో డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, జిల్లా ఎన్‌క్వాస్ మేనేజర్ విద్యాసాగర్ పీహెచ్‌సీలో వసతుల రూపకల్పనలో దృష్టి సారించారు. ఆరు విభాగాల్లో 8 అంశాలపై చర్చించారు. రెండు రోజులపాటు పీహెచ్‌సీలో తనిఖీలు చేపడతారని వైద్యసిబ్బంది తెలిపారు. డీఐవో మహేశ్, డీపీవో ఉమ, పీహెచ్‌సీ వైద్యాధికారులు రేణుక, రేణుప్రియ ఉన్నారు.

వైద్యసిబ్బందిపై ఎంపీపీ ఆగ్రహం

బోయినపల్లి పీహెచ్‌సీని ఎన్‌క్వాస్ బృందం పర్యటించిన విషయంలో సమాచారం ఇవ్వలేదని ఎంపీపీ వేణుగోపాల్ సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ అయిన ఎంపీపీకి సమాచారం ఇవ్వకపోవడంపై మండిపడ్డారు.



బోయినపల్లి పీహెచ్‌సీలో ఎన్‌క్వాస్ బృందం

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం మండెపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో గంజాయి సేవిస్తూ, తరలిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. వేములవాడ మండలం నాంపల్లికి చెందిన వడిచర్ల జాన్ ప్రతాప్‌రెడ్డి సోమవారం మండెపల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా తంగళ్లపల్లి ఎస్సై పి.లక్ష్మారెడ్డి తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతడి వద్ద తనిఖీ చేయగా 230 గ్రాముల గంజాయి లభించినట్లు చెప్పారు. గంజాయిని స్వాధీనం చేశామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ ఉపేందర్

ఇంటికి చేరిన వలసజీవి మృతదేహం

- కొడుముంజలో విషాదచాయలు

వేములవాడఅర్బన్: దుబాయిలో వారం క్రితం గుండెపోటుతో మృతిచెందిన మండలంలోని కొడుముంజకు చెందిన నాగుల పర్శయ్య(55) మృతదేహం సోమవారం ఇంటికి చేరింది. పర్శయ్యకు ఇద్దరు కుమార్తె. చిన్నకూతురు స్వప్న తండ్రి చితికి నిప్పు పెట్టింది. ఇద్దరు కుమార్తెల భర్తలు కూడా గతంలో మృతి చెందడంతో మూడు కుటుంబాలకు మగదిక్కు లేకుండా పోయింది.



రోదిస్తున్న బంధువులు

చికిత్స పొందుతూ కూలీ మృతి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌కు చెందిన బొల్లె చంద్రం(38) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 24న కొండచెరువు కట్టపై బొల్లె చంద్రం, తాటకర్ల రాజుల ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నట్లు తెలిపారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ చంద్రంను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న చంద్రం మృతితో భార్య లత, కుమారుడు రాకేశ్, కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని కుటుంబాన్ని సర్పంచ్ తన్నీరు గౌతంరావు పరామర్శించారు.

బహ్రెయిన్‌లో ధర్మారం వాసి..

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం బహ్రెయిన్ వెళ్లిన మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన మైలారం నర్సయ్య(41) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. బహ్రెయిన్‌లోని బల్దియాలో పనిచేస్తున్న నర్సయ్య విధులకు వెళ్తూ గుండెపోటుకు గురయ్యాడు. గమనించిన తోటి మిత్రులు ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. నర్సయ్యకు భార్య అనురాధ, అభినాశ్, శృతి ఉన్నారు.

బురదలో పడి యువరైతు మృతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన దళిత యువరైతు పొలంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు బురదలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన నారాయణపూర్‌లో విషాదం నింపింది. గ్రామానికి చెందిన యువరైతు బక్కోళ్ల నర్సింలు(29) గ్రామ శివారులోని తనకు ఉన్న ఎకరం పొలంలో వరిపంట సాగు చేశాడు. పొలంలో పనిచేస్తూ ఒడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కాలుజారీ కిందపడడంతో ముక్కుభాగం బురదలో కూరుకుపోయి శ్వాస ఆడక ప్రాణాలు వదిలాడు. సమీపంలో ఉన్న రైతులు వెంటనే నర్సింలును ఎల్లారెడ్డిపేటలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య లలిత, కుమారులు దినేశ్, గణేష్ ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ నిమ్మ లక్ష్మి, మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య కోరారు.



నర్సింలు(ఫైల్)

దద్దరిల్లిన సిరిసిల్ల

- కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ ఆఫీసుల ముట్టడి
- ప్రభుత్వ తీరుపై ప్రజాసంఘాల ఆందోళనలు
- ప్రభుత్వ తీరుపై నిరసనలు



ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులు

సిరిసిల్లటౌన్: వరుస నిరసనలతో సిరిసిల్ల దద్దరిల్లింది. ప్రభుత్వ తీరుపై విద్యార్థులు, ట్రేడ్ యూనియన్లు నిరసనలు తెలిపాయి. విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ, జీపీ కార్మికుల సమస్యలపై సీపీఎం, బీసీ బంధులో పద్మశాలీలను చేర్చాలని సీపీఐ పార్టీలు డిమాండ్ చేస్తూ..కార్యక్రమాలు చేపట్టాయి.

విద్యారంగాన్ని పటిష్టం చేయాలి

ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ కోరారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్‌ను ముట్టడించారు. వారు మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేయలేదన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి అధిక నిధులు కేటాయించాలని, టీచర్స్, ఎంఈవో పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందించారు. కళ్యాణ్‌కుమార్, మనోజ్‌కుమార్, రాకేశ్, ఆదిత్య, రామ్‌చరణ్, అరవింద్, వేణు, రోహిత్, శ్రీజ పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు సిరిసిల్లలో ర్యాలీ తీశారు. జీపీ కార్మికుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ చాగంటి వెంకటయ్య మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలపై ఉన్న శ్రద్ధ కార్మికులపై లేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారోబార్లకు, కార్యదర్శులకు పంచాయతీ కార్మికులను సహాయకులుగా నియమించాలని కోరారు. కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, మూశం రమేశ్, మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్, అన్నల్‌దాస్ గణేశ్, మల్యాల నర్సయ్య, బూర్ల శ్రీనివాస్, కత్తి లక్ష్మణ్ పాల్గొన్నారు.

పద్మశాలీలకు బీసీబంధు ఇవ్వాలి

పద్మశాలీలను రాష్ట్ర సర్కారు బీసీబంధులో చేర్చాలని సీపీఐ కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీసు ముందు ధర్నా చేపట్టారు. మంత్రి కేటీఆర్ స్పందించి పద్మశాలీలకు న్యాయం చేయాలని కోరారు. నాయకుల సామల మల్లేశం, అజ్జ వేణు, కదారి రాములు, మంచికట్ల రమేష్, సోమ నాగరాజు, సత్యనారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అనాథలుగా మిగిలిన అన్నాచెల్లెళ్లు

- నాడు తండ్రి ఆత్మహత్య, నేడు తల్లి అనారోగ్యంతో మృతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఏడేళ్ల క్రితం తండ్రి ఆత్మహత్య చేసుకోగా.. సోమవారం తల్లి అనారోగ్యంతో మరణించింది. తల్లిదండ్రుల మరణంతో అన్నాచెల్లెళ్లు అనాథలుగా మారారు. తంగళ్లపల్లిలో అద్దె ఇంట్లో ఉంటున్న బత్తిని నర్సయ్య–రమాదేవిలకు కొడుకు సాయి, కూతురు గాయత్రి ఉన్నారు. కాగా తండ్రి నర్సయ్య ఏడేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి రమాదేవి అనారోగ్యంతో సోమవారం మృతిచెందింది. సాయి కిరాణషాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూతురు గాయత్రి ఇంటర్ పూర్తి చేసింది. చదువు మానేసి తల్లికి సేవలు చేస్తోంది. సొంతిల్లు కూడా లేకపోవడంతో ఆ చిన్నారులు కన్నీరుమున్నీరవుతున్నారు. అనాథలైన అన్నా చెల్లెలును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న గాయత్రి

అంత్యక్రియలకు దాతల సాయం

రమాదేవి అంత్యక్రియలకు ఇంట్లో డబ్బులు లేకపోవడంతో దాతలు సాయం చేశారు. జెడ్పీటీసీ పూర్మాని మంజుల–రాంలింగారెడ్డి దంపతులు రూ.2500, ఎగుమామిడి విజయేందర్‌రెడ్డి రూ.2,100, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్ రూ.వెయ్యి తదితరులు ఆర్థికసాయాన్ని అందజేశారు.

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

డిపో మేనేజర్ మురళీకృష్ణ

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో నుంచి కరీంగనగర్ మీదుగా తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక లగ్జరీ బస్సును నడిపిస్తున్నట్లు వేములవాడ డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. వేములవాడ బస్టాండ్ నుంచి జూలై 1న రాత్రి 9 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని తెలిపారు. కరీంనగర్‌కు రాత్రి 10 గంటలకు చేరుకుని అక్కడి నుంచి అరుణాచలం బయలుదేరనుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకంలోని విఘ్నేశ్వరుని దర్శనం అనంతరం జూలై 2న రాత్రి 10 గంటలకు అరుణాచలం చేరుకుంటుంది. అరుణాచలేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత జూలై 3వ తేదీ సాయంత్రం 3 గంటలకు వెల్లూరులోని గోల్డెన్‌టెంపుల్, శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయం, 4వ తేదీ మధ్యాహ్నం వరకు కరీంనగర్ మీదుగా వేములవాడకు చేరుకుంటుందని వివరించారు. ఈ టూర్ ప్యాకేజీ ధర ఒక్కరికి రూ.4 వేలు, 12 సంవత్సరాలలోపు పిల్లలకు రూ.3వేలు ఉంటుందని వివరించారు. trrtconine.in వెబ్‌సైట్‌లో ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవాలని, వేములవాడ బస్టాండ్‌లోని ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్‌లోనూ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 99592 25926,73828 51826 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

చిరుజల్లులకే ఎత్తిపోసుడు



సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు వానాకాలం కష్టాలు మొదలయ్యాయి. సోమవారం తెల్లవారుజామున చిరుజల్లులు కురిశాయి. చిన్నపాటి వర్షానికే కలెక్టరేట్‌లో కొద్దిపాటి నీరు నిలిచింది. ఆ నీటిని తొలగించేందుకు మోటారును ఏర్పాటు చేశారు. వర్షం నీరు ఎప్పటికప్పుడు వెళ్లిపోయేలా నిర్మాణం లేకపోవడంతో ఇలా నీరు నిలుస్తోంది. 2021లో భారీ వర్షాలకు కలెక్టరేట్ ప్రాంగణం ముంపునకు గురికాగా.. వరదనీరు లోనికి రాకుండా కట్ట పోశారు. అప్పటి నుంచి కలెక్టరేట్‌లోని నీరు బయటకు వెళ్లే మార్గం సరిగ్గా లేక ఇలా ఎత్తిపోస్తున్నారు. భారీ వర్షాలు పడితే పరిస్థితి ఏంటనే ప్రశ్నలు వస్తున్నాయి. జిల్లాలో అత్యధికంగా చందుర్తిలో 22.1 మిల్లీమీటర్లు, అత్యల్పంగా ముస్తాబాద్‌లో 1.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రుద్రంగిలో 6.9, వేములవాడరూరల్‌లో 7.3, బోయినపల్లిలో 2.6, వేములవాడలో 7.7, సిరిసిల్లలో 5.2, కోనరావుపేటలో 5.8, వీర్నపల్లిలో 7.9, ఎల్లారెడ్డిపేటలో 5.4, గంభీరావుపేటలో 3.7, తంగళ్లపల్లిలో 1.6, ఇల్లంతకుంటలో 5.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మిషన్ పరివర్తన పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల: మిషన్ పరివర్తన పోస్టర్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోస్టర్లను రూపొందించారు. జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, మహిళా శక్తి కోఆర్డినేటర్ రోజా, సఖీ కేంద్రం నిర్వాహకురాలు పద్మ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలి

వేములవాడఅర్బన్: పాలిటెక్నిక్ ప్రవేశాల్లో తొలిదశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 29లోగా ఫీజు చెల్లించాలని అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ తెలిపారు. సీటు వచ్చిన కళాశాలలో జూలై 7 నుంచి 10వ తేదీ వరకు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఆదాయ ధ్రువీకరణపత్రాలు సమర్పించని వారు కరీంనగర్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. చివరి విడత సర్టిఫికెట్ల పరిశీలన జూలై 2న ఉంటుందని, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

రామాలయంలో చోరీ

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలోని సీతారామస్వామి దేవస్థానంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయంలోని దేవతామూర్తులకు సంబంధించిన వెండి పూజసామగ్రిని ఎత్తుకెళ్లారు. ఏఎస్సై ప్రభాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం పోలీసులు చోరీపై ఆరా తీశారు.

మైనర్‌ను వేధించిన వ్యక్తిపై కేసు

సిరిసిల్లక్రైం: ఒంటరిగా రోడ్డు మీద నుంచి నడుచుకుంటూ వెళ్తున్న మైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సోమవారం సిరిసిల్ల సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కొండ రాహుల్ అదే ఏరియాలో ఉండే పదేళ్ల వయస్సు గల అమ్మాయిని వెంబడిస్తూ పేరు, ఇల్లు వివరాలు అడిగాడు. లైంగికంగా వేధింపులకు గురిచేసే విధానంలో అమ్మాయిపై చేయిచేసుకున్నాడు. ప్రబుద్ధుడి నుంచి తప్పించుకుని తన తాత వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని వెల్లడించింది. వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని బండలింగంపల్లికి చెందిన గంగసారం భవ్య(21) కనిపించడం లేదని తండ్రి భిక్షపతి సోమవారం పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు. భవ్య ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుకుంటోంది. ఆదివారం స్నేహితుల దగ్గరికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన భవ్య తిరిగి రాలేదు. తల్లిదండ్రులు చుట్టుపక్కల ఇళ్లు, బంధువుల ఇళ్లలో ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.